జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం

## భద్రాద్రి కొత్తగూడెం
బుధవారం | 18 | జూన్ | 2025 • పేజీలు : 5



# గోదావరి వరదల పట్ల అప్రమత్తంగా ఉండాలి

## ▪ జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్

**కొత్తగూడెం కలెక్టరేట్, జూన్ 17, ప్రజాజ్యోతి:** గోదావరి వరదలు వల్ల ప్రజలకు ఇబ్బంది పడకుండా అన్ని ఏర్పాట్లుతో సిద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. మంగళవారం ఐడిఓసి కార్యాలయంలో గోదావరి వరదలపై జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, ఐటీడీఏ పీవో రాహుల్, అదనపు కలెక్టర్ వేణుగోపాల్ ,భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్ సింగ్ తో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరదల్లో చిక్కుకున్న వారిని రక్షించేందుకు ప్రతి అధికారి వాహనంలో లైఫ్ జాకెట్లు,టార్చి లైటు, తాడు, హ్యాండ్ మైకు, అందుబాటులో ఉండాలన్నారు. ఎటువంటి ప్రమాదాలు జరుగకుండా ముందస్తు ప్లడ్ మేనేజ్మెంట్ ప్రణాళిక తయారు చేయాలని చెప్పారు. వరద ముంపుకు గురయ్యే గ్రామాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తర లించేందుకు పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేయాలని చెప్పారు. ముంపుకు గురయ్యే వరకు వేచి ఉండకుండా ముందస్తుగానే ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించే విధంగా సన్నద్ధంగా ఉండాలని చెప్పారు. వరదల నుండి ప్రజలను కాపాడేందుకు గ్రామస్థాయి ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. సన్నాహక సమావేశంలో దిశానిర్దేశం చేసిన అంశాల పట్ల అన్ని శాఖల అధికారులు సమగ్ర కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలని చెప్పారు. వరదల్లో చిక్కుకున్న వ్యక్తులను రక్షించేందుకు లైఫ్ జాకెట్లు, గజ ఈతగాళ్లు, నాటుపడవలు, బోట్లు సిద్ధంగా ఉంచాలని కోరారు, రానున్న మూడు నెలల వరకు అనగా అక్టోబర్ మాసం వరకు సరిపోను

మిగతా 2 లో...

# డి ఎల్ ఈ డి కళాశాల 11వ బ్యాచ్ కి ప్రవేశాల కొరకు దరఖాస్తులు ఆహ్వానం : ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్

**భద్రాచలం ,జూన్ 17,ప్రజాజ్యోతి :** 2025 –27 విద్యా సంవత్సరానికి గాను గిరిజన డి ఎల్ ఈ డి కళాశాల 11వ బ్యాచ్ కి ప్రవేశాల కొరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ మంగళవారం నాడు ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో మొత్తం 50 సీట్లు కలవని దరఖాస్తు చేసుకునే విద్యార్థులు ఏజెన్సీ ప్రాంత వాసులు అయ్యి ఉండాలని, విద్యార్థులు ఇంటర్మీడియట్ లో కనీసం 45 శాతం మార్కులతో ఉత్తీర్ణత



మిగతా 2 లో...

# ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య



**టేకులపల్లి,జూన్17, ప్రజాజ్యోతి:** టేకులపల్లి మండలం దాస్ తండా పంచాయితీ పరిధిలోని రేగుల తండా గ్రామంలో ఓ యువకుడు మంగళవారం అనుమాన స్థితిలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. రేగుల తండా గ్రామానికి చెందిన బానోత్ కిషన్–పద్మ దంపతులకు ఇద్దరు కుమార్తెలు ఒక కుమారుడు ఉన్నారు. వీరిలో ఒక కుమార్తె పెళ్లి కాగా , రెండో కుమార్తె, చివరి కుమారుడు బానోత్ లోకేష్ (22) చదువుకుంటున్నారు. మంగళవారం లోకేష్ ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్ కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆత్మహత్యపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.




# రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలి

## ▪ జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్

**కొత్తగూడెం కలెక్టరేట్, జూన్ 17, ప్రజాజ్యోతి:** జిల్లా రహదారులపై ప్రమాదాలు జరగకుండా సమగ్రమైన రహదారి భద్రత ప్రణాళిక రూపొందించాలని కలెక్టర్ జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. బుధవారం ఐ డి ఓ సి కార్యాలయం సమావేశ మందిరంలో జిల్లా ఎస్ పి రోహిత్ రాజు తో కలసి రహదారి భద్రతపై జిల్లా స్థాయి టాస్క్ ఫోర్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముందుగా రోడ్డు ప్రమాదాలు ఎక్కడెక్కడ జరుగుతున్నాయో ఆ స్థలాలను గుర్తించాలని ఆదేశించారు. ఈ నెల చివరి నాటికి రహదారులపై ఉన్న గుంతలు అన్ని పూడ్చాలని అధికారులను ఆదేశించారు. ప్రమాదాలు జరిగినప్పుడు తక్షణ చికిత్స నిమిత్తం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ తరపున ప్రణాళిక రూపొందించాలని డీఎంహెచ్ వో ను ఆదేశించారు. ముందుగా జాతీయ రహదారులు,

మిగతా 2 లో...

# భద్రాద్రి రామయ్యను దర్శించుకున్న ఏపీ మాజీ స్పీకర్ తమ్మినేని



**భద్రాచలం, జూన్ 17(ప్రజాజ్యోతి ):** భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారిని ఆంధ్రప్రదేశ్ మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం కుటుంబ సమేతంగా మంగళవారం దర్శించుకున్నారు. తొలుత ఆలయ అధికారులు, అర్చకులు ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ధ్వజస్తంభం వద్ద పూజల అనంతరం గర్భగుడిలో పూజలు నిర్వహించి అర్చకులు ఆయనకు వేదాశీర్వచనం అందించారు. అనంతరం శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయంలోని ఉప ఆలయాలైన అభయాంజనేయస్వామి, లక్ష్మీతాయారు అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు ఆలయ విశిష్టతను ఆయనకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలి

(మొదటి పేజీ తరువాయి...)

ఆర్ అండ్ బీ, పంచాయతీరాజ్, ట్రాన్స్ పోర్ట్, పోలీస్, రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి రహదారి ప్రమాదాలు జరిగేందుకు ఆస్కారం ఉన్న గుర్తించిన ప్రదేశాలలో రోడ్డు ప్రమాదాలు జరిగేందుకు గల కారణాలపై అధ్యయనం చేయాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలు జరిగిన తర్వాత ప్రాణాలు పోకుండా తక్షణమే ఆసుపత్రులకు తీసుకెళ్లేందుకు అవకాశం ఉన్న దగ్గరి రహదారులు, హాస్పిటళ్లను ఎంపిక చేయాలని తెలిపారు. అదేవిధంగా అంబులెన్స్ లు, ట్రామా కేంద్రాలపై ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. రామవరం ట్రామా కేర్ కేంద్రం నిర్మాణ పనులను త్వరితగతిగా పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాలోని ప్రతి నియోజకవర్గం లో సిపిఆర్ మానిక్యూర్ కిట్లు అందుబాటులో ఉంచాలని, సిబ్బందికి సిపిఆర్ పై శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు.ప్రమాదాలు సంభవించకుండా రహదారులపై సైన్ బోర్డులతో పాటు, రేడియం స్టిక్కర్లు, జీబ్రాలైన్లు, స్టాపేజీలు వంటి వాటిని ఏర్పాటు చేయాలని కోరారు. జిల్లాలో మోటార్ వాహనాల వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో రహదారి ప్రమాదాలు నానాటికిఅధికమవుతున్నాయన్నారు. వాహనాలు కండిషన్ గా లేకపోవడం, అతివేగం, డ్రైవర్ల నిర్లక్ష్యం, ట్రాఫిక్ సిగ్నల్స్ పాటించకపోవడం వల్ల ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై కేసులు నమోదు చేసి జైలు శిక్షలు పడేలా చర్యలు చేపట్టాలన్నారు. తరచూ ప్రమాదాలు జరిగే ప్రదేశంలో గుర్తించి వాటి నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలని. కళాశాలలు మరియు పాఠశాలల్లో విద్యార్థులకు రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలోని రహదారుల్లో ప్రమాదకరమైన మలుపుల వద్ద అడ్డుగా ఉన్న చెట్లను తొలగించాలన్నారు. మున్సిపాలిటీలోని ప్రధాన కూడళ్ళలో పార్కింగ్ ప్రదేశాలను గుర్తించాలన్నారు. కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలోని పెద్ద బజార్ మరియు చిన్న బజార్ ప్రాంతాలలో పార్కింగ్ కొరకు అనువైన స్థలాన్ని గుర్తించాలని ఆదేశించారు.రహదారుల్లో ప్రమాదాల నియాత్రలకు అన్ని శాఖలు సమన్వయంగా పటిష్టమైన ప్రణాళికను రూపొందించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అనంతరం రహదారి భద్రతపై రూపొందించిన గోడ పత్రికను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సమావేశంలో భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్ సింగ్,జిల్లా వైద్య శాఖ అధికారి భాస్కర్ నాయక్, జిల్లా రవాణా శాఖ అధికారి వెంకటరమణ, ఆర్ అండ్ బి ఈ వెంకటేశ్వరరావు, పంచాయతీ రాజ్ ఈ ఈ శ్రీనివాసరావు, జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర చారి, జిల్లా పంచాయతీ అధికారి చంద్రమౌళి మరియు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.


(ఫైల్ ఫోటో)

# గోదావరి వరదల పట్ల అప్రమత్తంగా ఉండాలి

(మొదటి పేజీ తరువాయి...)



అన్ని రకాల నిత్యావసర వస్తువులు స్టాకు ఉంచాలని జిల్లా పౌర సరఫరాల అధికారిని ఆదేశించారు. వరద ముంపు చర్యలు పర్యవేక్షణకు సెక్టోరియల్, జోనల్ అధికారులను నియమించనున్నట్లు చెప్పారు. వరద యొక్క సమాచారాన్ని ప్రజలకు చేరవేసేందుకు ముంపు గ్రామాల ప్రజల ఫోన్ నెంబర్లను అందుబాటులో ఉంచుకోవాలన్నారు, విద్యుత్ అంతరాయం లేకుండా పంచాయతీరాజ్, విద్యుత్తు శాఖ అధికారులు ముందస్తుగానే ముంపు గ్రామాల్లో పరిశీలన చేయాలని కోరారు, ముంపుకు గురయ్యే అవకాశాలున్న ప్రాంతాల్లో రక్షణ చర్యలు చేపట్టి విద్యుత్తు అంతరాయం లేకుండా చూడాలని చెప్పారు. అత్యవసర సేవలకు హెలికాప్టర్ సేవలు వినియోగించుకోవడానికి అనుగుణంగా హెలిప్యాడ్లు ఏర్పాటు చేయాలని రహదారులు భవనాల శాఖ అధికారులకు సూచించారు. అత్యవసర సేవలు కొరకు మొబైల్ సెట్లు వినియోగించేందుకు సెట్లు అందుబాటులో ఉంచాలని చెప్పారు. గోదావరికి పై నుండి వచ్చే వరద సమాచారం ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ప్రజలను అప్రమత్తం చేస్తుండాలని చెప్పారు. ముంపు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలింపు విషయంలో ప్రాధాన్యతలను తెలియచేయడంతో పాటు ఇబ్బందులు రాకుండా ముందస్తుగానే ఆయా గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు, కిన్నెరసాని వంటి ప్రాజెక్టులు గేట్లు ఎత్తు సమయంలో ప్రభావిత ప్రాంతాలకు ముందస్తుగా తెలియజేయు విధంగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

పునరావాస కేంద్రాల్లో ఆహారాన్ని తయారు చేసేందుకు వంట చేసే సిబ్బందిని సిద్ధంగా ఉంచాలని చెప్పారు. భద్రాచలం సబ్ కలెక్టర్ కార్యాలయంలో 24 గంటలు పనిచేయు చేయు విధంగా ఫ్లడ్ కంట్రోల్ రూము ఏర్పాటుతో పాటు మండల, జిల్లాస్థాయిలో కంట్రోల్ రూములు ఏర్పాటు చేయాలని చెప్పారు. వరదల సమయంలో గర్భిణి మహిళలు ఇబ్బందులు. పడకుండా ముందస్తు జాబితాను సిద్ధం చేసి సమీపంలోని ఆసుపత్రుల్లో చేర్పించు విధంగా చర్యలు తీసుకోవాలని, ప్రతి ప్రాథమిక ఆరోగ్యసంరక్షణకేంద్రంలో ఈడీ క్యాలెండర్ తప్పనిసరిగా ఉండాలని ఆదేశించారు. వైద్య శాఖ 108 అంబులెన్సులు అందుబాటులో ఉంచాలని,సిబ్బందికి ప్రమాదం జరిగినప్పుడు చేపట్టాల్సిన చర్యలు, ప్రాథమిక వైద్యం పై శిక్షణ నిర్వహించాలని వైద్యశాఖ అధికారులను ఆదేశించారు.వరదల సమయంలో వాగులు, వంకలు పొంగి పొర్లుతుంటాయని ప్రజలు దాటే ప్రయత్నం చేయకుండా బారికేడింగ్ చేయాలని చెప్పారు. వాగులు దాటించడం వల్ల ప్రజలతో పాటు పశువులు కూడా ప్రమాదానికి గురయ్యే అవకాశాలున్నాయని, కాబట్టి ముందస్తుగానే సమాచారం ప్రజలకు చేరవేసి రక్షణ చర్యలు పాటించు విధంగా చర్యలు తీసుకోవాలని చెప్పారు. వరదల సమయంలో అత్యవసర వైద్యసేవలకు అంతరాయం లేకుండా మందులను సిద్ధంగా ఉంచాలని చెప్పారు. పాము, తేలు కాటు వంటి విష జంతువులకు సంబంధించిన వ్యాక్సిన్లు అందుబాటులో ఉంచాలని, వ్యాక్సిన్ అందక ఎటువంటి ప్రాణ నష్టం జరిగినా సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని వైద్యాధికారులకు తెలిపారు . సింగరేణి, కేటిపిఎస్, ఐటిసి, నవభారత్ తదితర సంస్థల రెస్క్యూ టీముల సేవలు వినియోగించుకునేందుకు జాబితా అందుబాటులో ఉంచాలని కోరారు, వర్షాకాలంలో పశువులు వ్యాధులకు గురికాకుండా టీకాలు వేయు కార్యక్రమాలను చేపట్టాలని పశుసంర్ధక అధికారులను ఆదేశించారు. వరదల సమయంలో పశువులు ప్రమాదాలకు గురి కాకుండా వాటిని పెద్ద తాడుతో కట్టివేసించాలని దీనిపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. గుత్తికోయ ఆవాసాల్లో పర్యటించి ఆరోగ్య పరిరక్షణ చర్యలు చేపట్టాలని చెప్పారు. లయింగ్ ఏరియాల్లో నీటి నిల్వలు లేకుండా డ్రెయిన్లు పరిశు భ్ర పరచడం, డ్రైయిన్లు నిర్మాణాలను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని చెప్పారు. విస్తా కాంప్లెక్సు, అశోక్ నగర్ నీటి నిల్వలు లేకుండా ఎత్తి పోసేందుకు మోటార్లును అందుబాటులో ఉంచాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. వరదనీరు నిల్వ లేకుండా వెళ్లేందుకు డ్రెయిన్లను పరిశుభ్రం చేయాలని చెప్పారు. నీటిపారుదల శాఖ పరిధిలో ఉన్న ప్రాజెక్టులు వాటి యొక్క గేట్ల మరమ్మత్తులను తక్షణమే పూర్తి చేయాలని, వాటి యొక్క పనితీరును పరిశీలించి నివేదిక తయారు చేయాలని ఆదేశించారు.ముంపు ప్రాంతాల్లో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహణకు అదనపు సిబ్బందిని ఏర్పాటు చేసుకోవాలని బ్లీచింగ్, సోడియం హైపో క్లోరైడ్ ద్రావణాన్ని స్ప్రే చేయించాలని చెప్పారు. మంచినీరు సఫరాకు ఇబ్బంది రాకుండా చూడాలని నీటి వనరులు ముంపుకు గురైతే మంచినీటి సరఫరాకు ఇబ్బంది రాకుండా ప్రత్యామ్మయ చర్యలు చేపట్టాలని పంచాయతీ అధికారులను ఆదేశించారు. 73 అడుగులు గోదావరి వరదలు వచ్చినప్పటికీ ఎదుర్కొనే విధంగా అధికారులు తగిన ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. ఆర్ అండ్ బి , పంచాయతీరాజ్ అధికారులు తమ పరిధిలోని లోవర్ బ్రిడ్జిలను గుర్తించి ప్రణాళికలు అందించాలని ఆదేశించారు. అన్ని లో లెవెల్ బ్రిడ్జిలు వద్ద ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. ఆగస్టు 15 లోపు తూర్పాక హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణ పనులను పూర్తిచేయాలని ఆర్ అండ్ బి అధికారులను ఆదేశించారు. మిషన్ భగీరథ పరిధిలోని మంజూరు అయిన పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా నీటిపారుదల శాఖ అధికారులు కెనాల్, ప్రాజెక్టుల వద్ద సుబాబులు మరియు సిస్సు మొక్కలను విస్తృతంగా నాటాలన్నారు. అధికారులందరూ కార్య స్థానం విడిచి వెళ్లరాదని క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని ఆదేశించారు.విధి నిర్వహణలో అలసత్వం వలన ఏ ఒక్క ప్రాణ నష్టం జరిగినా సంబంధిత అధికారుల పైన కఠిన చర్యలు ఉంటాయని అధికారులను కలెక్టర్ హెచ్చరించారు.

**అనంతరం ఐటీడీఏ పీవో రాహుల్ మాట్లాడుతూ**

ధర్తీధన్ భాగీదారీ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గిరిజనులకు ఆధార్ కార్డ్ నమోదులు , నవీకరణలు, ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డ్ జారీ, జన్ ధన్ బ్యాంక్ ఖాతాలు తెరవడం, పి ఎం-కిసాన్ యోజన నమోదులు, పెన్షన్ పథకాల నమోదులు, స్కాలర్ షిప్ లు, బీమా పథకాలు, నైపుణ్య శిక్షణ, జీవనోపాధి కార్యక్రమాల నమోదు వంటి కీలకమైన ప్రభుత్వ సేవలను పొందేందుకు గ్రామంనివాస శిబిరాలను 15 రోజులపాటు నిర్వహించాలన్నారు. ఈ శిబిరాల ద్వారా అర్హత కలిగిన ఏ ఒక్క గిరిజన కుటుంబాన్ని వదిలిపెట్టకుండా అందరికీ లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, భద్రాచలం ఆర్డీవో దామోదర్ రావు, అన్ని శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## డి ఎల్ ఈ డి కళాశాల 11వ బ్యాచ్ కి ప్రవేశాల కొరకు దరఖాస్తులు ఆహ్వానం : ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్

(మొదటి పేజీ తరువాయి...)

సాధించి ఉండాలని అన్నారు. ఈనెల 16 నుండి జూలై 10వ తేదీ వరకు విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవచ్చని అన్నారు. గిరిజన డి ఎల్ ఈడి కళాశాల 2014-15 విద్యా సంవత్సరంలో ప్రారంభమైందని, ఈ కళాశాల కేవలం ఏజెన్సీ ప్రాంత విద్యార్థులను ఉపాధ్యాయులుగా తయారు చేయాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేయబడిన ఏకైక ప్రత్యేక కళాశాల అని, ఈ కళాశాలలో ఇంటర్మీడియట్ విద్యార్థులు ఎటువంటి అర్హత పరీక్షలు లేకుండా కేవలం మెరిట్ ఆధారంగా సీట్లు ఎంపిక చేయటం కళాశాలలో ఉన్న ప్రత్యేకత అని, ఈ కళాశాలను 2014లో ఏకపాకలో పక్కా భవనాలతో ఏర్పాటు చేసినప్పటికీ ఆ తర్వాత రాష్ట్ర విభజన సమయంలో ఏటపాక ఆంధ్రకు వెళ్లడం వలన ఈ కళాశాలను 2015 నుండి భద్రాచలంలోని గిరిజన బీఈడీ కళాశాలలో ప్రారంభించడం జరిగిందని, 2014 నుండి ఈరోజు వరకు 10 బ్యాచులు పూర్తిచేసుకుని మొత్తం 450 మంది విద్యార్థులకు ఉపాధ్యాయ శిక్షణ ఇవ్వడం జరిగిందని, దీనిలో దరిదాపుగా 49 మంది ఎస్జిటి ఉద్యోగాలు సాధించి ప్రభుత్వ ఉద్యోగాలు చేయడం గర్వకారణమని ఆయన అన్నారు. కళాశాలలో మొత్తం 50 సీట్లు ఉండగా కేవలం తెలంగాణ ఏజెన్సీ ప్రాంత విద్యార్థులకు మాత్రమే అవకాశం కల్పిస్తున్నారని, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో డీఎడ్ కళాశాల లేకపోవడం వల్ల గిరిజన డి ఎల్ ఈ డి కళాశాలకు ఎస్సీ ఆర్ టి వారు నిర్వహించే FLN ట్రైనింగ్, ఇతరత్రా శిక్షణలో ప్రత్యేక గుర్తింపు ఉందని, 2023 సుప్రీంకోర్టు తీర్పు ప్రకారము ఎస్జీటీ పోస్టులకు కేవలం డి ఈ డి చేసిన వారు మాత్రమే అర్హులు అని తీర్పు ఇవ్వడంతో గిరిజన బి.ఎడ్ కళాశాలకు మరింత ప్రాధాన్యత పెరిగిందని అన్నారు. ఈ కళాశాలలో ప్రత్యేకతలు, ఏజెన్సీ షెడ్యూల్ ప్రాంత విద్యార్థుల కోసం ఏర్పాటు చేయబడిన ప్రత్యేక ఏకైక కళాశాల, ఇంటర్మీడియట్ మార్కుల ఆధారంగా అనగా పూర్తిగా మెరిట్ ద్వారా సీట్ల కేటాయింపు, ప్రతి సంవత్సరం 100% డిస్టింక్షన్ లో ఫలితాలు, కళాశాల ప్రాంగణంలో మహిళలకు ప్రత్యేకమైన హస్టల్ సదుపాయం, విద్యార్థులకు ప్రత్యేకమైన లైబ్రరీ, అనుభవజ్ఞులైన అధ్యాపకులు బోధన ప్రక్రియలో మరియు డీఎస్సీ సంబంధించిన అంశాలు పాఠ్యాంశాలతో పాటు బోధించుట, టిఎల్ఎం వర్క్ షాప్స్ సెమినార్స్, డిబేట్స్, పరీక్షలు నిర్వహించుట, నాణ్యమైన విద్యా బోధన, థియరీ మరియు ప్రాక్టికల్ సమ ప్రాధాన్యత కల్పించుట, ప్రతి విద్యార్థి పైన ప్రత్యేక పర్యవేక్షణ ఉంటుందని ఆయన అన్నారు. కావున దరఖాస్తు చేయు అభ్యర్థులు ప్రిన్సిపాల్, డి ఎల్ ఈ డి కళాశాల చర్ల రోడ్డు భద్రాచలం నందు సంప్రదించాలని, ఈ దరఖాస్తులు ఉట్నూరు మరియు ఏటూరునాగారం ఐటీడీఏలలో కూడా లభిస్తాయని ఆయన అన్నారు. మరిన్ని వివరాల కొరకు ప్రిన్సిపాల్ వైకెడి భవాని ఫోన్ నెంబర్లు 9959575539,9949493416 లకు సంప్రదించి తెలుసుకోవాలని ఆయన కోరారు.

# బిజెపితోనే దేశాభివృద్ధి సాధ్యం



**టేకులపల్లి,జూన్17,ప్రజాజ్యోతి :** మండలంలోని కొక్యతండా తండా గ్రామంలో భారతీయ జనతా పార్టీ పార్టీ మండల అధ్యక్షులు తేజవత్ శంభూ నాయక్ ఆధ్వర్యంలో మోడి 11సం వత్సరాల పాలనలో భాగంగా వికసిత్ భారత్ అమృత కాలం, సేవ సుపరిపాలన, పేదల సంక్షేమానికి మరింతగా అభివృద్ధి ఆకాంక్షిస్తూ ప్రజా సంకల్ప సభ ఏర్పాటు చేయటం జరిగింది . ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా జిల్లా అధ్యక్షులు బై రెడ్డి ప్రభాకర్ రెడ్డి ఈ సందర్భంగా మాట్లాడుతూ మోడి పేదల సంక్షేమానికి అమలు చేస్తున్న పథకాలను వివరించటమే కాకుండా శత్రు దేశాలతో యుద్ధ వాతావరణ సమయంలో తీసుకున్న నిర్ణయాలను,మిత్ర దేశాలతో కలిసి భారత ఆర్థిక వ్యవస్థను అభివృద్ధి పథంలో నడిపిస్తున్న విధానాన్నివివరించారు. ప్రపంచంలోనే భారతదేశంలో పేదరికం నిర్మూలన చేసి 4వ స్థానానికి ఆర్థిక వ్యవస్థను తెచ్చారు. మోడి అంటే మన దేశానికి రక్షణ, భరోసా అని కొనిడారు.మొన్న పాకిస్తాన్ ఉగ్రవాదులు పహాల్గవ్ ప్రాంతంలో మన భారతీయ స్త్రీల భర్తలను చంపేసి మోడికి చెప్పుకోండి అని చెబితే ఆపరేషన్ సింధూర్ ద్వారా కేవలం ఇద్దరు మహిళా కమెండర్స్ సహాయంతో పాక్ లోని ఉగ్ర స్థావరాలపై లక్ష్యంగా 20-25నిముషాల మధ్యలోనే ఉగ్ర మూకలను మట్టుపెట్టిన ఘనత మోడికే దక్కుతుందని అన్నారు.పాకిస్తాన్ కే కాదు భారత్ జోలికి వస్తే ఎవరైనా మట్టిలో కలవాలసిందే అని ప్రపంచ శత్రుదేశాలను హెచ్చరించారు టిఆర్ఎస్ పార్టీకి 10ఏండ్లు అధికారం ఇస్తే కే సి అర్ నియంత పాలన వలన ఒక కుటుంబం మాత్రమే గుపడ్డది.ఇప్పుడు కాంగ్రెస్ పార్టీకి అధికారం ఇస్తే కే సి అర్ బాటలోనే రేవంత్ రెడ్డి పాలిస్తున్నారని,ఇందిరమ్మ ఇండ్లు రేవంత్ ఇచ్చేది కాదని కేంద్రంలో ఉన్న మోడి ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకం ద్వారా నిధులు ఇస్తే కాంగ్రెస్ పార్టీ దాన్ని నిరు పేదలకు కేటాయించకుండా దుర్వినియోగం చేస్తుందని చెప్పారు.గ్రామంలోని ఇంటింటికి తిరిగి ప్రజల కష్టాలు, ఇందిరమ్మ ఇండ్ల వివరాలు అడిగి తెలుసుకున్నారు.మరి ఇప్పుడు రాబోయే స్థానిక ఎన్నికల్లో ప్రజలు బీజేపీ పార్టీ అభ్యర్థులను గెలిపించి మోడీ అభివృద్ధి బాటలో అడుగులు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా టీచర్స్ సెల్ కన్వినర్ హతీరం నాయక్,టేకులపల్లి మండలం చీఫ్ గెస్ట్ మురళి కృష్ణ, పాల్వంచ టౌన్ అధ్యక్షులు రాపాక రమేష్ జిల్లా కౌన్సిల్ మెంబెర్ బాలాజీ యక్, గ్రామం పెద్దఅజ్మీరా సూర్య నాయక్, పార్టీ సినియర్ నాయకులు మంగత్య నాయక్,సత్యం ,ప్రధాన కార్యదర్శి నాగేందర్, కార్యదర్శి లక్పతి నాయక్, నవీన్,జమాల్,బాల, రాందా స్,రాజు, యువకులు, మహిళలు అధిక సంఖ్య లో పాల్గొన్నారు.

# కరకట్ట నిర్మాణం పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

- **గోదావరి ముంపు నుండి భద్రాచలాన్ని రక్షించాలి**
- **పోలవరం బ్యాక్ వాటర్ వల్ల భద్రాచలానికి జరిగే నష్టానికి కేంద్ర బిజెపి ప్రభుత్వం బాధ్యత వహించాలి**
- **నత్త నడకన నడుస్తున్న కరకట్ట నిర్మాణం పనులు**
- **కరకట్ట నిర్మాణం పనులను పరిశీలించిన సిపిఎం జిల్లా బృందం**





**భద్రాచలం టౌన్, జూన్ 17(ప్రజాజ్యోతి):** భద్రాచలం పట్టణం గోదావరి ముంపుకు గురికాకుండా 38 కోట్లతో సుభాష్ నగర్ కాలనీ వైపు నిర్మిస్తున్న కరకట్టను త్వరితగతిన పూర్తి చేయాలని, గోదావరి ముంపు నుండి భద్రాచలం పట్టణాన్ని రక్షించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు,రాష్ట్ర కమిటీ సభ్యులు ఏజే రమేష్ లు అన్నారు.నిర్మాణంలో ఉన్నకరకట్ట పనులను సిపిఎం బృందం నేడు పరిశీలించింది. అనంతరం ఇరిగేషన్ అధికారులను కలిసి కరకట్ట పనులకు సంబంధించిన అంశాలను చర్చించడం జరిగింది.టిఆర్ఎస్ ప్రభుత్వం మంజూరు చేసిన కరకట్టను అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం నిధులను మంజూరు చేసి పనులు ప్రారంభించినప్పటికీ నేటికీ కరకట్ట పనులు పూర్తి కాలేదని నత్తనడకన పనులు సాగుతున్నాయని వారు అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రితో పాటు జిల్లాలోని ముగ్గురు మంత్రులు కరకట్టను త్వరితగతిన పూర్తి చేస్తామని భద్రాచలం ముంపు నుండి రక్షిస్తామని హామీలు గుప్పించి ఆ మాటే మరిచారని అన్నారు. ప్రారంభంలో హడావుడి చేసిన మంత్రులకు కరకట్ట నిర్మాణం పట్ల చిత్తశుద్ధి లేదని అన్నారు. వర్షాకాలం వచ్చే లోపు కరకట్ట పూర్తి చేస్తామని ప్రగల్బాలు పలికిన మంత్రులు కరకట్ట ఇంకా ఎందుకు పూర్తి కాలేదొ సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. భద్రాచలం ఎంపీ,ఎమ్మెల్యేలకు ఈ సమస్య పట్టదని విమర్శించారు. పోలవరం బ్యాక్ వాటర్ వల్ల భద్రాచలానికి జరిగే నష్టానికి కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం బాధ్యత వహించాలని అన్నారు. నిత్యం రామజపం చేసే బిజెపి వారికి భద్రాచలం రాముడు మునుగుతున్న పట్టదా అని ప్రశ్నించారు.పోలవరం బ్యాక్ వాటర్ ముంపు పై రీ సర్వే చేయించాలని డిమాండ్ చేశారు.. గతంలో నిర్మించిన పాత కరకట్టను ఎత్తు పెంచి, పొడిగించి పటిష్టంగా నిర్మించేందుకు కావలసిన నిధులను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేయాలని అందుకు రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి చేయాలని అన్నారు. గోదావరి ఫ్లడ్ మాన్యువల్ ను మార్పు చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్నకరకట్టను పూర్తి చేసి పాత కరకట్టకు నిధులు మంజూరు చేయాలని లేకుంటే సిపిఎం ఆధ్వర్యంలో దశల వారి పోరాటం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

**ఇరిగేషన్ అధికారులతో సిపిఎం బృందం భేటీ**

కరకట్ట పనులు పరిశీలన అనంతరం ఇరిగేషన్ ఈ ఈ,డి ఈ జేఏలతో సిపిఎం బృందం భేటీ అయింది. కరకట్ట పనులు ఆలస్యానికి గల కారణాలను అడిగి తెలుసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా ఈ ఈ మహమ్మద్ జానీ మాట్లాడుతూ కర కట్ట నిర్మాణంలో అంతర్భాగమైన హై లెవెల్ రోడ్డు నిర్మాణానికి సర్వే చేసి ఎస్టి మేషన్స్ నేషనల్ హైవే అధికారులకు పంపడం జరిగిందని అన్నారు. ప్రస్తుతం జరుగుతున్న పనులు త్వరితగతిన పూర్తిచేసి సుభాష్ నగర్ కాలనీ లోకి వరద రా కుండా తగు చర్యలు చేపడతామని అన్నారు. పోలవరం బ్యాక్ వాటర్ ముంపు పై ఆంధ్ర,తెలంగాణ అధికారులతో జాయింట్ సర్వేకు అప్పీలు చేశామని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా హైదరాబాద్ ఐఐటి ఇంజనీరింగ్ నిపుణులతో సర్వే చేసేం దుకు ప్రత్యేక నిధులు మంజూరు చేసిందని తెలిపారు. ఈ సర్వే బృందంలో సిపిఎం పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎంబీ నర్సారెడ్డి,జిల్లా కమిటీ సభ్యులు సున్నం గంగా, బండారు శరత్ బాబు,పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు వై వెంకట రామారావు పట్టణ కమిటీ సభ్యులు కుంజా శ్రీనివాస్,అజయ్ కుమార్, ధనకొండ రాఘవయ్య, కోరాడ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్లో యోగ ప్రాముఖ్యతపై అవగాహన



**టేకులపల్లి,జూన్ 17,ప్రజాజ్యోతి:** మండలంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ బద్దుతండా లో సులానగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆయుష్ విభాగం వారి ఆధ్వర్యంలో పిల్లలకు యోగా ప్రాముఖ్యతపై విద్యా బోధన చేసి వారిచే యోగాసనాలు చేపించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయుష్ వైద్యాధికారిణి విజయ శ్రీ మాట్లాడుతూ ప్రాచీన యోగా భారతీయుల అమూల్య సంపద అని దీనిలోని విశేషమైన ఆరోగ్య రహస్యాలు తెలిసిన ప్రపంచ దేశాలన్నీ దీనిని ఆచరించి లబ్ధి పొందుతున్నాయని యోగా చేయడం వల్ల మానసిక ఒత్తిడి తగ్గి మెదడుకు శక్తిని ఇస్తుందని జీవనక్రియలను మెరుగుపరిచి రోగ నిరోధక శక్తి పెరిగి వ్యాధులను దూరం చేస్తుందని నిద్రలేమి సమస్యలను దూరం చేస్తుందని ఎముకలను దృఢంగా చేస్తుందని జీర్ణ క్రియను మెరుగుపరుస్తుందని శ్వాసక్రియను మెరుగుపరిచి శరీరమంతటికి చక్కటి ప్రాణవాయువు తో కూడిన మెరుగైన రక్త ప్రసరణకు తోడ్పడుతుందని ఇంకా ఎన్నో ప్రయోజనాలు ఉన్నవి కాబట్టి ప్రతి ఒక్కరూ భారతీయ సంప్రదాయ యోగా ని ఆచరించి దాని ఫలితాలు అనుభవించి సుఖవంతమైన ప్రశాంతమైన ఆరోగ్యవంతమైన జీవితాన్నిగడపాలని కోరారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నిశాంత్ కృష్ణవ, వైస్ ప్రిన్సిపల్ జ్యోతి, స్టాఫ్ నర్స్ భవాని, వ్యాయామ ఉపాధ్యాయులు రమాదేవి, మహేష్,ఇతర ఉపాధ్యాయ సిబ్బందితో పాటు ఆయుష్ వైద్యాధికారిణి విజయ శ్రీ, యోగా ఇన్స్ట్రక్టర్ ప్రమీల, ఫార్మసిస్ట్ రజిత ,విజయ, మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్ ధరణి, స్వప్న, ఆశా కార్యకర్తలు విజయ కవిత మంగ తదితరులు పాల్గొన్నారు.

## యువతను తప్పుదోవ పట్టిస్తున్న కోడిపందాలు,పేకాట నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి

- **ఎన్.ఎస్.యు.ఐ నియోజకవర్గ అధ్యక్షులు సరెళ్ళ వెంకటేష్**



**భద్రాచలం టౌన్, జూన్ 17(ప్రజాజ్యోతి ):** యువతను తప్పుదోవ పట్టిస్తున్న కోడిపందాలు,పేకాట నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి ఎన్.ఎస్.యు.ఐ నియోజకవర్గ అధ్యక్షులు సరెళ్ళ వెంకటేష్ అన్నారు.భద్రాచలం పట్టణానికి చెందిన కొందరు వ్యక్తులు ఒక ముఠాగా ఏర్పడి కోడి పందాలు,పేకాట నిర్వహిస్తున్నారని,ఈ విధమైన అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించడం వల్ల యువత ఈ వ్యసనాలకు బానిసలై వారి బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారు అని అన్నారు. పేకాట,కోడిపందాల నిర్వహణ ఆంధ్ర ప్రాంతం భద్రాచలం సరిహద్దుల్లో జరుగుతున్నప్పటికీ నిర్వహణ నిర్వాహకులందరూ భద్రాచలం ప్రాంతానికి చెందినవారని, నిర్వాహకులందరిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానిక భద్రాచలం పోలీస్ స్టేషన్లో ఎస్సై జి.స్వప్నకి కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంస్థ ఎన్.ఎస్.యు.ఐ తరపున ఫిర్యాదు చేస్తున్నామని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో. రాహుల్ గాంధీ సోషల్ మీడియా నియోజకవర్గ అధ్యక్షులు కత్త శ్రీనివాస్ పాల్గొన్నారు.

## సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం



**టేకులపల్లి,జూన్ 17, ప్రజాజ్యోతి:** టేకులపల్లి కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయం నందు తెలంగాణ రాష్ట్రం లోని రైతులకు వానాకాలం పంట పెట్టుబడి సాయంకింద రైతు భరోసా పథకం ద్వారా పూర్తి స్థాయిలో సాగు చేసే టటువంటి ప్రతీ ఎకరాకు 6000 / – ఆరు వేల రూపాయలు రైతుల ఖాతాల్లో జమ చేసి రైతన్నలకు అండగా నిలిచిన కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ముఖ్య మంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి చిత్రపటానికి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, రైతున్నలు, పాలాభిషేకం చేశారు.ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరం సురేందర్ మాట్లాడుతూ వానకాలం పంట పెట్టుబడి సాయం కింద తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సాగు చేసే టటువంటి ప్రతి ఒక్క ఎకరాకు రైతు భరోసా అందించి రైతన్నలను అన్ని విధాలుగా ఆదుకుంటుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతి ఒక్క హామీని నెరవేరుస్తూ రాష్ట్ర ప్రజలకు అండగా నిలుస్తునరాని, రాష్ట్రం అప్పుల ఊబిలో ఉన్నపటికీ ప్రభుత్వం పథకాలను అమలు చేయటంలో వెనకడుగు వేయకుండా ప్రజా పరిపాలన అందిస్తుందని రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపు కొరకు కార్యకర్తలు కృషి చేయాలనీ నాయకులు ప్రజల మద్యల్లో ఉండి వారి సమస్యలను తెలుసుకొని పరిష్కరించే విధంగా పని చేయాలనీ వారు కోరారు,. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు దేవా నాయక్ , నాయకులు ఈది గణేష్, పోశాలు, రెడ్యానాయక్, బండ్లరజినీ, సరోజిని,సరిత,రజియా,భద్రు,లక్కినేని శ్యామ్, శంకర్,మధు రెడ్డి,వీరభద్రం,సర్దార్,చందర్ సింగ్,శివ,బొడ్డు అశోక్,రాసమళ్ళ నర్సయ్య,అఫ్రోజ్, నవీన్,బస్సీ లాల్, కోటి,చెన్నయ్య, పూన్య నాయక్,ఊకె నరేందర్,ఊకె రామకృష్ణ,సత్యం, విజయ్,సంజయ్,బానోత్ రవి,ఈశ్వర్,ఇస్లావత్ గణేష్, నగేష్,ధర్మయ్య గౌడ్, బానోత్ శంకర్,హనుమంతు, గోవర్ధన్, జింకల రాజు,వెంకటి, శివాజీ, శేఖర్,సుధీప్ తదితరులు పాల్గొన్నారు.

## పాల్వంచ సీనియర్ టిడిపి నాయకురాలు జయమ్మ మృతి

- నివాళులర్పించిన వివిధ పార్టీల రాజకీయ నాయకులు





**కొత్తగూడెం కలెక్టరేట్, జూన్17, ప్రజా జ్యోతి :** పాల్వంచకు చెందిన ప్రముఖ తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకురాలు కాటబోయిన జయలక్ష్మి(86) జయమ్మ మంగళవారం తన స్వగృహంలో మృతి చెందింది, జయమ్మ గత కొంతకాలం నుండి అనారోగ్యంతో బాధపడుతుండగా తన కుమారులు వైద్యం అందిస్తున్నప్పటికీ చికిత్స పొందుతూ మృతి చెందింది, మృతురాలు జయమ్మ తెలుగుదేశం పార్టీలో దివంగత నందమూరి తారక రామారావు హయాంలోనే పార్టీలో చురుకైన పాత్ర పోషించారు, ఆమె మొదటిగా వార్డు కౌన్సిలర్ గా పనిచేయ డంతో పాటు, తెలుగుదేశం పార్టీ మహిళా జిల్లా అధ్యక్షురాలుగా, టిడిపి రాష్ట్ర నాయ కురాలుగా పనిచేస్తూ అన్ని వర్గాల ప్రజలకు అనేక సేవలందించడంతోపాటు పాల్వంచ, కొత్తగూడెం ప్రాంతాలలో తెలుగుదేశం పార్టీ బలోపేతానికి అహర్నిశల కృషి చేశారు, అనేకమంది తెలుగుదేశం పార్టీలో పనిచేసి వివిధ పార్టీలు మారినప్పటికీ జయలక్ష్మి మాత్రం తెలుగుదేశం పార్టీలోనే నిలకడగా ఉంటూ మహిళా నాయకురాలుగా పేరుగావించింది, అదేవిధంగా జయమ్మ నామకరణంతో పాల్వంచ పట్టణంలో జయమ్మ కాలనీగా పేరు కూడా ఏర్పడింది, జయమ్మ మృతి చెందినట్లు విషయం తెలుసుకున్న పాలవంచ పట్టణానికి చెందిన ప్రముఖ టిడిపి నాయకులు , వివిధ పార్టీల నాయకులు, పట్టణానికి చెందిన ప్రముఖులు ఆమె మృతదేహం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శిం చారు, మృతురాలకి నలుగురు కుమారులు ఒక కుమార్తె ఉన్నారు, జయమ్మ అంత్యక్రియలు బుధవారం పాల్వంచలో నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

# మాదకద్రవ్య రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి

- యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి
- జిల్లా స్థాయి యాంటీ డ్రగ్ కమిటీ సమావేశంలో జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్



**కొత్తగూడెం కలెక్టరేట్, జూన్ 17, ప్రజా జ్యోతి:** భద్రాద్రి కొత్తగూడెంను మాదకద్రవ్య రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ పిలుపునిచ్చారు. మంగళవారం ఐడిఓసి కార్యాలయం సమావేశ మందిరంలో జిల్లా స్థాయి యాంటీ డ్రగ్ కమిటీ సమన్వయ సమావేశం జిల్లా ఎస్ పి రోహిత్ రాజు తో కలసి నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు, యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. మాదకద్రవ్యాలు వినియోగం లేకుండా పోలీసులు పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. గంజాయి, మత్తు పదార్థాలు వినియోగించకుండా ఉండేలా కళాశాల యజమాన్యాలు, తల్లిదండ్రులు పిల్లలపై దృష్టి పెట్టాలన్నారు. విద్యాసంస్థల్లో నిర్వహించే పేరెంట్స్ టీచర్ సమావేశాల్లో డ్రగ్స్,గంజాయి వినియోగం వల్లే కలిగే అనర్థాలపై అవగాహన కల్పించాలని అన్నారు.గంజాయి వినియోగం వల్ల కలిగే అనర్థాలపై యదార్థ సంఘటన ఆధారంగా వారి భవిష్యత్తుపై ఎటువంటి ప్రభావం చూపడుతుందో వీడియోల ద్వారా జిల్లా వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. డ్రగ్స్, మాదకద్రవ్యాల వల్ల కలిగే నష్టాలపై వైద్య అధికారులతో అవగాహన కల్పించాలన్నారు. డ్రగ్స్, ఇతర మాదకద్రవ్యాలు అలవాటు ఉన్న వారిని గుర్తించి వారిని పునరావాస కేంద్రాలు ద్వారా అలవాటు మానిపించాలన్నారు. చుట్టుపక్కల ఎవరైనా పిల్లలు మాదకద్రవ్యాలను అలవాటు పడిన పడినట్లు తెలిస్తే వెంటనే సమాచారం అందించాలని కలెక్టర్ సూచించారు. మాదకద్రవ్యాల రవాణా, సాగు, వినియోగం నివారణ కు పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్ర సరిహద్దుల వద్ద చెక్పోస్టుల ద్వారా నిరంతర నిఘా ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలో గంజాయి తో పాటు గుడుంబా నివారణకు సైతం అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. అటవీ శాఖ అధికారులు వారి పరిధిలోని అటవీ భూములను పరిశీలించి గంజాయి సాగు కనిపిస్తే వెంటనే పోలీస్ అధికారులకు సమాచారం అందించాలన్నారు. జిల్లాలోని ఆసుపత్రులు మెడికల్ షాపుల్లో స్టాక్ వివరాలను ప్రతి నెల తనిఖీ చేయాలని కలెక్టర్ డ్రగ్ ఇన్స్పెక్టర్కు సూచించారు. చెడు అలవాట్ల వల్ల ఆరోగ్యం దెబ్బతింటుందని, ఆలోచన విధానం, ఆలో చన శక్తి నశిస్తాయన్నారు. భావితరాలు మాదకద్రవ్యాల పట్ల ఆకర్షితులు కా కుండా వారికి సమాజంలో మంచి, చె డు తెలియజేయాలని కలెక్టర్ పేర్కొన్నా రు.

**మాదకద్రవ్యాలు వినియోగించిన, రవాణా చేసిన పిడి యాక్టర్ నమోదు చేస్తాం ... జిల్లా ఎస్పీ రోహిత్ రాజు**

మాదకద్రవ్యాలు వినియోగించిన లేదా రవాణా చేసిన పీడి యాక్ట్ నమోదు చేస్తామని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు అన్నారు. జిల్లా వ్యాప్తంగా ఈ సంవత్సరం ఇప్పటివరకు 3,500 కేజీల గంజాయిని సీజ్ చేసినట్టు ఆయన తెలిపారు. జిల్లాకు ఒరిస్సా నుండి వయా సీలేరు ద్వారా అటవీ ప్రాంతం నుండి గంజాయి రవాణా నియంత్రించేందుకు భద్రాచలం చెక్ పోస్ట్ ద్వారా 24 గంటల పటిష్టమైన నిఘా ఏర్పాటు చేసి గంజాయి రవాణా ను అడ్డుకుంటున్నామని తెలిపారు. రాష్ట్రంలోనే మొట్టమొదటిసారిగా మాదకద్రవ్యాలు గుర్తించేందుకు రెండు నార్కోటిక్ డాగ్ లను అందుబాటులోకి తీసుకువచ్చామని తెలిపారు. దానికి గాను రాష్ట్రస్థాయిలో అవార్డు కూడా అందుకున్నామన్నారు. ఆధ్యాత్మిక సాంకేతిక పరిజ్ఞానం మరియు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి జిల్లాలో మాదకద్రవ్యాల రవాణాకు అడ్డుకట్ట వేస్తున్నట్లు ఎస్పీ వివరించారు. మాదకద్రవ్య ల వినియోగం పట్ల విద్యార్థులకు , యువకులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని వాటి వినియోగం వల్ల పడే శిక్షల గురించి తెలపాలని అధికారులకు సూచించారు. పాఠశాలలో పోక్సో చట్టంపై అవగాహన కల్పించాలన్నారు. మాదకద్రవ్యాలు వినియోగాన్ని అడ్డుకునేందుకు డ్రగ్ టెస్టింగ్ కిట్లను కూడా అందుబాటులోకి తేనున్నట్లు ఆయన తెలిపారు. భద్రాచలంలో డి ఎడిక్షన్ సెంటర్ ను కూడా అందుబాటులో తీసుకువచ్చినట్లు ఎస్పీ తెలిపారు. ఈ సమీక్ష సమావేశంలో భద్రాచలం ఏ.ఎస్.పి విక్రాంత్ సింగ్, ఎక్సైజ్ సూపర్ టెంట్ జానయ్య, ఇల్లందు డి ఎస్పీ రమణమూర్తి, కొత్తగూడెం ఆర్ టి ఓ వెలసిరి వెంకటరమణ, జిల్లా వైద్యశాఖ అధికారి భాస్కర్ నాయక్, జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర చారి, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి వెంకటేశ్వర్లు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబురావు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రైతు భరోసానిధులు విడుదల చేయడం పట్ల హర్షం

- యువ నాయకులు చింతిరాల అరుణ్ రాజ్,సేవాదళ్ నాయకులు శీలం రామ్ మోహన్ రెడ్డి

**భద్రాచలం ,జూన్ 17,ప్రజాజ్యోతి :** రైతు భరోసానిధులు విడుదల చేయడం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క,వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు,రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి లకు భద్రాచలం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు చింతిరాల అరుణ్ రాజ్,సేవాదళ్ మండల అధ్యక్షులు శీలం రామ్ మోహన్ రెడ్డిలు కృతజ్ఞతలు తెలుపుతూ హర్షం వ్యక్తం చేసారు .వానాకాలం సీజన్ కు రైతులకు పెట్టుబడి సాయం కింద రైతు భరోసా తొలిరోజు 2 ఎకరాలు ఉన్న రైతులకు రూ.6 వేల చొప్పున జమ 41.25 లక్షల మంది రైతులకు 2,349.83కోట్లు జమ చేసిన ప్రభుత్వం.. ఎకరాలతో సంబంధం లేకుండా మిగిలిన వారికి వచ్చే 9 రోజుల్లోనిధులు జమ రాష్ట్ర చరిత్రలో చారిత్రక నిర్ణయమని అన్నారు. వచ్చే 9 రోజుల్లోనే అన్నదాతల ఖాతాల్లోకి రైతు భరోసా మొత్తం నిధులు జమ చేస్తాం ఏ ఒక్క ఎకరానికైనా లిమిట్ లేకుండా, సాగు చేస్తున్న ప్రతి ఎకరాకు ఏడాదికి ₹12,000 చొప్పున రైతు భరోసా అందించిన ఘనత కాంగ్రెస్ కె దక్కిందని అన్నారు . పదేళ్లు రాష్ట్రాన్ని పాలించిన వారు రైతుల పక్షాన నిలవలేకపోయిన బీఆర్ఎస్ నాయకులు బురదజల్లే పని మానుకొని, రైతులకోసం పోరాడుతున్న ప్రజా ప్రభుత్వాన్ని గౌరవించండని హితవు పలికారు .రైతు కోసం నిలిచే ప్రభుత్వం.. రైతును ప్రేమించే ప్రభుత్వం కాంగ్రెస్.. రైతు అంటే కాంగ్రెస్ – కాంగ్రెస్ అంటే రైతు అని భద్రాచలం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు చింతిరాల అరుణ్ రాజ్,మండల అధ్యక్షులు శీలం రామ్ మోహన్ రెడ్డిలు అన్నారు.





## దర్తి అభా జన్బగిరది అభియాన్ కార్యక్రమాన్ని సద్వినియోగించుకోవాలి




**పాల్వంచ (రూరల్ ), జూన్ 17,ప్రజా జ్యోతి :** ఎస్ టి ప్రజలు ఎక్కువగా ఉన్న గ్రామాలలో "దర్తి అభా జన్బగిరది అభియాన్" కార్యక్రమం కింద ఈనెల 15వ తేదీ నుండి 30 వరకు గ్రామ సభలు నిర్వహించడం జరుగుతుంది.ఈ గ్రామ సభల యందు ఆధార్ కార్డు,ఆయుష్మాన్ భారత్ కార్డు,జన్ దన్ ఎకౌంటు, కులం ధ్రువీకరణ పత్రం,కిసాన్ సమృద్ధి యోజన,మాతృ వందనం, ఓటరు గుర్తింపు కార్డు,ఎఫ్ఆర్ఏ పట్టాలు,రేషన్ కార్డులు,ఉపాధి హామీ జాబ్ కార్డు ల కొరకు దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుంది.కావున వీటిని ఎస్టీ గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో విజయభాస్కర్ రెడ్డి కోరడం జరిగింది. "దర్తి అభా జన్బగిరది అభియాన్" కార్యక్రమంలో భాగంగా మంగళవారం గంగాదేవి పల్లి,వెంగమ్మ గుంపు గ్రామాల ప్రజల కొరకు ఉల్వనూరు గ్రామపంచాయతీ కార్యాలయంలో గ్రామసభ నిర్వహించి ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారి జి రమణ, కార్యదర్శి నరేష్,ఆర్ ఐ అనిన్ కుమార్,ఎస్బిఐ ఫీల్డ్ ఆఫీసర్ కె ప్రకాష్‌రావు,ఏవో శాంతి, హెల్త్ సూపర్వైజర్ సరళ దేవి,ఏఎన్ఎం సుధా,ఫీల్డ్ అసిస్టెంట్ సారయ్య తదితరులు పాల్గొనడం జరిగింది.

# గిరిజన డి ఎల్ ఈ డి 11వ బ్యాచ్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

- ఐటీడీఏ పీవో రాహుల్



**భద్రాచలం, జూన్ 17 ప్రజా జ్యోతి :** 2025 –27 విద్యా సంవత్సరానికి గాను గిరిజన డి ఎల్ ఈ డి కళాశాల 11వ బ్యాచ్ కి ప్రవేశాల కొరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో మొత్తం 50 సీట్లు కలవని దరఖాస్తు చేసుకునే విద్యార్థులు ఏజెన్సీ ప్రాంత వాసులు అయ్యి ఉండాలని, విద్యార్థులు ఇంటర్మీడియట్ లో కనీసం 45 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించి ఉండాలని అన్నారు. ఈనెల 16 నుండి జూలై 10వ తేదీ వరకు విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవచ్చని అన్నారు. గిరిజన డి ఎల్ ఈడి కళాశాల 2014–15 విద్యా సంవత్సరంలో ప్రారంభమైందని, ఈ కళాశాల కేవలం ఏజెన్సీ ప్రాంత విద్యార్థులను ఉపాధ్యాయులుగా తయారు చేయాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేయబడిన ఏకైక ప్రత్యేక కళాశాల అని, ఈ కళాశాలలో ఇంటర్మీడియట్ విద్యార్థులు ఎటువంటి అర్హత పరీక్షలు లేకుండా కేవలం మెరిట్ ఆధారంగా సీట్లు ఎంపిక చేయటం కళాశాలలో ఉన్న ప్రత్యేకత అని, ఈ కళాశాలను 2014లో ఏకపాకలో పక్కా భవనాలతో ఏర్పాటు చేసినప్పటికీ ఆ తర్వాత రాష్ట్ర విభజన సమయంలో ఏటపాక ఆంధ్రకు వెళ్లడం వలన ఈ కళాశాలను 2015 నుండి భద్రాచలంలోని గిరిజన బీఈడీ కళాశాలలో ప్రారంభించడం జరిగిందని, 2014 నుండి ఈరోజు వరకు 10 బ్యాచులు పూర్తి చేసుకుని మొత్తం 450 మంది విద్యార్థులకు ఉపాధ్యాయ శిక్షణ ఇవ్వడం జరిగిందని, దీనిలో దరిదాపుగా 49 మంది ఎస్జిటి ఉద్యోగాలు సాధించి ప్రభుత్వ ఉద్యోగాలు చేయడం గర్వకారణమని ఆయన అన్నారు. కళాశాలలో మొత్తం 50 సీట్లు ఉండగా కేవలం తెలంగాణ ఏజెన్సీ ప్రాంత విద్యార్థులకు మాత్రమే అవకాశం కల్పిస్తున్నారని, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో డీఎడ్ కళాశాల లేకపోవడం వల్ల గిరిజన డి ఎల్ ఈ డి కళాశాలకు ఎస్సీఆర్ టి వారు నిర్వహించే FLN ట్రైనింగ్, ఇతరత్రా శిక్షణలో ప్రత్యేక గుర్తింపు ఉందని, 2023 సుప్రీంకోర్టు తీర్పు ప్రకారము ఎస్జీటీ పోస్టులకు కేవలం డి ఈ డి చేసిన వారు మాత్రమే అర్హులు అని తీర్పు ఇవ్వడంతో గిరిజన బి.ఎడ్ కళాశాలకు మరింత ప్రాధాన్యత పెరిగిందని అన్నారు. ఈ కళాశాలలో ప్రత్యేకతలు, ఏజెన్సీ షెడ్యూల్ ప్రాంత విద్యార్థుల కోసం ఏర్పాటు చేయబడిన ప్రత్యేక ఏకైక కళాశాల, ఇంటర్మీడియట్ మార్కుల ఆధారంగా అనగా పూర్తిగా మెరిట్ ద్వారా సీట్ల కేటాయింపు, ప్రతి సంవత్సరం 100% డిస్టింక్షన్ లో ఫలితాలు, కళాశాల ప్రాంగణంలో మహిళలకు ప్రత్యేకమైన హాస్టల్ సదుపాయం, విద్యార్థులకు ప్రత్యేకమైన లైబ్రరీ, అనుభవజ్ఞులైన అధ్యాపకులు బోధన ప్రక్రియలో మరియు డీఎస్సీ సంబంధించిన అంశాలు పాఠ్యాంశాలతో పాటు బోధించుట, టిఎల్ఎం వర్క్ షాప్స్ సెమినార్స్, డిబేట్స్, పరీక్షలు నిర్వహించుట, నాణ్యమైన విద్యా బోధన, థియరీ మరియు ప్రాక్టికల్ సమ ప్రాధాన్యత కల్పించుట, ప్రతి విద్యార్థి పైన ప్రత్యేక పర్యవేక్షణ ఉంటుందని ఆయన అన్నారు. దరఖాస్తు చేయు అభ్యర్థులు ప్రిన్సిపాల్, డి ఎల్ ఈ డి కళాశాల చర్ల రోడ్డు భద్రాచలం నందు సంప్రదించాలని, ఈ దరఖాస్తులు ఉట్నూరు మరియు ఏటూరునాగారం ఐటీడీఏలలో కూడా లభిస్తాయని ఆయన అన్నారు. మరిన్ని వివరాల కొరకు ప్రిన్సిపాల్ వైకెడి భవాని ఫోన్ నెంబర్లు 9959575539, 9949493416 లకు సంప్రదించి తెలుసుకోవాలని ఆయన కోరారు.

# బాధితురాలికి 'నేస్తం' ఆర్థికసాయం



**బూర్గంపహాడ్, జూన్ 17 (ప్రజా జ్యోతి) :** మండల పరిధిలోని నాగినేనిప్రోలు రెడ్డిపాలెం గ్రామానికి చెందిన వలదాసు వెంకటమ్మ అనారోగ్యానికి గురి కావడంతో నిరుపేద కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకునేందుకు మోరంపల్లిబంజర్కు చెందిన నేస్తం చారిటబుల్ ట్రస్టు చైర్మన్ బత్తుల రామకొండారెడ్డి, సభ్యుల చేతులమీదుగా మంగళవారం రూ.10వేలు ఆర్థికసాయం అందించారు. వెంకటమ్మ భర్త సోమయ్య తాపీపని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇద్దరు ఆడపిల్లలు కావడంతో వారికి పెళ్లి చేసి పంపించారు. అయితే రెండేళ్ల క్రితం వెంకటమ్మకు గర్భాశయం ఆపరేషన్ చేయించారు. ఆ తర్వాత కడుపులో గడ్డతో మరోసారి ఆపరేషన్ చేశారు. ఆ సమయంలో డెంగ్యూ జ్వరం వచ్చి సీఐడీపీ(క్రానిక్ ఇన్ఫ్లమేటరీ డిమైలినేటింగ్ పాలి న్యూరోపతి) వైరస్ వ్యాప్తి చెంది శరీరమంతా చలనం కోల్పోయింది. అయితే ప్రతినెలా రూ.20వేల ఖరీదైన ఇంజక్షన్ 15 నెలల పాటు చేయించాల్సి రావడంతో ఇప్పటికే 9 సార్లు చేయించారు. 6 నెలలు పాటు ఇంజక్షన్ చేయించుకునేందుకు ఆర్థికంగా ఇబ్బందులు పడుతుండటంతో ఆ బాధితురాలి పరిస్థితి తెలుసుకుని నేస్తం చారిటబుల్ ట్రస్టు అండగా నిలిచి తమవంతుగా రూ.10 వేలు ఆర్థికసాయం అందించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ చింతా అంకిరెడ్డి, గౌరవ అధ్యక్షులు సంకా సురేష్, సభ్యులు కైపు రమేష్‌రెడ్డి, బాలనారాయణరెడ్డి, ఆవుల శివనాగిరెడ్డిలు పాల్గొన్నారు.

# రైతు భరోసా పథకం కింద లబ్ది పొందిన రైతుల వివరాలను వెల్లడించిన కలెక్టర్ జితేష్ వి పాటిల్

**కొత్తగూడెం కలెక్టరేట్, జూన్ 17, ప్రజా జ్యోతి:** రైతు భరోసా క్రింద లబ్ది పొందిన రైతుల వివరాలను జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతు భరోసా పథకం లో భాగంగా జిల్లాలో గత యంసంగిలో వున్న పట్టాదారుల సంఖ్య – 1,78, 545. గాను ఈ వానా కాలంలు కొత్తగా ఇచ్చిన పట్టాదారుల సంఖ్య – 1023 ,గత సీజన్లో బ్యాంకు వివరాలు సరిగా లేని పట్టా దారుల సంఖ్య –832 , 550 మంది గతంలో బ్యాంకు వివరాలు నమోదు చేయనివారు ఉన్నారన్నారు, వానాకాలం పంటకు సంబంధించి ఇప్పటి వరకు జిల్లాలు 1,79,535 మంది లబ్ధిదారుల వివరాలు వ్యవసాయ విస్తరణ అధికారుల ద్వారా సేకరించి పోర్టల్ లో నమోదు చేయటం జరిగిందని, వీటికి సంబంధించి 16–06–202 వరకు 1,48,823 మంది లబ్ధి దారులకు గాను 186,38,77,971 రూ// లను ట్రెజరీకి పంపటం జరిగిందన్నారు, నిన్నటి వరకు 83,271 మంది లబ్ధిదారులకు గాను 56,69,78,012/– నేరుగా రైతుల ఖాతాలలో జమ చేశామన్నారు, ఈనెల 17న మరో 30,127 మంది లబ్ధిదారులకు గాను 45,41,05671/– నేరుగా రైతుల ఖాతాలో జమ చేయటం జరిగిందన్నారు, మొత్తం లబ్దిదారులు – 1,13,398 లబ్ధిదారులు గాను – 102,10,83,683/ జమ చేయడం జరిగిందన్నారు, నూతనంగా పట్టాలు పొందిన రైతులు తమయొక్క పట్టాదారు పుస్తకం, ఆధార్ కార్డు,బ్యాంకు అకౌంట్ నకలును సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారికి సమర్పించి రైతు భరోసా పోర్టల్ నందు నమోదు చేసుకోవాల్సిందిగా రైతులను కలెక్టర్ కోరారు. అర్హులైన రైతులందరికీ రైతు భరోసా అందుతుందని ఈ విషయంపై రైతులు ఆందోళనలు చెందవద్దని కలెక్టర్ తెలిపారు.

# భద్రాద్రి రామయ్యకు నిత్యకల్యాణం



**భద్రాచలం కల్చరల్ , జూన్ 17(ప్రజాజ్యోతి ):** భద్రాచలం శ్రీసీతారామ చంద్రస్వామి దేవస్థానంలో స్వామివారికి అర్చకులు నిత్యకల్యాణం నిర్వహించారు. మంగళవారం తెల్లవారుజామున ఆలయ తలుపులు తెరిచి సుప్రభాత సేవ, ఆరాధన, ఆరగింపు, సేవాకాలం, నిత్యహోమాలు, నిత్యబలిహరణం తదితర నిత్యపూజలు నిర్వహించారు. గాలి గోపురానికి అభిముఖంగా ఉన్న ఆంజనేయస్వామి వారికి ఉదయం పంచామృతాభిషేకం చేసి తమలపాకులు, సింధూరంతో పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి నిత్యకల్యాణ మూర్తులను బేడా మండపానికి తీసుకువచ్చి శాస్త్రోకంగా నిత్యకల్యాణం నిర్వహించారు. అనంతరం కల్యాణంలో పాల్గొన్న జంటలకు శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

# వర్షాకాలం దృష్ట్యా తగిన పారిశుద్ధ్య పనులు ముమ్మరం చేయాలి

- పంచాయతీ సెక్రెటరీ కి వినతి పత్రం అందించిన బిఆర్ఎస్ నాయకులు



**చర్ల, జూన్17, ప్రజాజ్యోతి:** చర్ల మేజర్ గ్రామ పంచాయతీలో నెలకొన్న సమస్య లను పరిష్కరించాలని బిఆర్ఎస్ పార్టీ మండల కన్వీనర్ దొడ్డి తాతారావు ఆధ్వర్యంలో పంచాయతీ సెక్రటరీ సురేష్ కి వినతిపత్రం అందజేశారు. దొడ్డి తాతారావు మాట్లాడుతూ రానున్న వర్షాకాలం దృష్టిలో వుంచుకొని ముందుగానే సైడ్ డ్రెయిన్ లను శుభ్రం చేయాలని, రోడ్డుకి ఇరువైపులా వున్న పిచ్చి మొక్కలను తొలగించాలని, అదేవిధంగా దోమల మందు పిచికారి చేయాలని, వీధి దీపాలు పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయాలని రోడ్లమీద నిలువ నీరు లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పంచాయతీ సెక్రెటరీ కి వినతి పత్రం ఇవ్వడం జరిగిందని తెలియచేశారు. సానుకూలంగా స్పందించిన పంచాయతీ సెక్రటరీ సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల సీనియర్ నాయకులు సయ్యద్ అజీజ్ , డివిజన్ యువజన నాయకులు కాకి అనిల్ , బిసి సెల్ అధ్యక్షులు గోరంట్ల వేంకటేశ్వరరావు, ఎస్సి సెల్ అధ్యక్షులు కొంబత్తిని రాము, మహిళా ఉపాధ్యక్షురాలు కొప్పుల సౌజన్య, టౌన్ కార్యదర్శి గాధంసెట్టి కిషోర్, యువజన నాయకులు తడికల బుల్లెబ్బాయ్, ఎన్నామూరి సృజన్, గంపల రమేష్, మైప వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# మైనారిటీ గురుకుల డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేయాలి

**కొత్తగూడెం కలెక్టరేట్, జూన్ 17 ప్రజా జ్యోతి:** రాష్ట్రంలో మైనారిటీ గురుకుల డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేయాలని కోరుతూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మైనారిటీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఎండీ.యాకూబ్ పాషా మైనారిటీ గురుకులాల కార్యదర్శి బి.షఫీవుల్లాను హైదరాబాద్ లోని ఆయన కార్యాలయంలో మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యాకూబ్ పాషా మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 204 మైనారిటీ గురుకుల జూనియర్ కళాశాలల్లో సుమారు 10,000 మంది విద్యార్థులు ప్రతి ఏటా ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు రాసి బయటికి వెళ్తున్నారని, మైనారిటీలకు గురుకుల డిగ్రీ కళాశాలలు లేకపోవడంతో అనేక మంది విద్యార్థులు గత ఐదేళ్లుగా ఇంటర్ తర్వాత చదువులతోనే స్వస్తి పలుకుతున్నారన్నారు.యస్సీ, యస్టీ, బీసీలకు రాష్ట్ర వ్యాప్తంగా 79 గురుకుల డిగ్రీ కళాశాలలున్నాయని, మైనారిటీలకు మాత్రం ఒక్క కళాశాల కూడా లేదన్నారు. దీని కారణంగా గురుకులాలో ఇంటర్ వరకు చదివిన విద్యార్థులు ఉన్నత విధ్యకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. కావున బాల, బాలికల కొరకు వేర్వేరుగా ఉమ్మడి జిల్లాలలో మైనారిటీ గురుకుల డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చెయ్యాలని డిమాండ్ చేశారు. స్పందించిన గురుకులాల కార్యదర్శి విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరిస్తానని తెలిపారన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ముస్లీం ఉద్యోగుల సంఘం అధ్యక్షులు ఎండి.ఫారూఖ్, మైనారిటీ నాయకులు పాల్గొన్నారు.

# అమ్మమాట-అంగన్వాడీ బాటలో చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసాలు



**బూర్గంపహాడ్, జూన్ 17 (ప్రజా జ్యోతి) :** మండల పరిధిలోని మోరంపల్లిబంజర్ సెక్టార్ పరిధిలోని లక్ష్మీపురం–1, 2, 3, కృష్ణసాగర్ పంచాయతీ బత్తులనగర్ అంగన్వాడీ కేంద్రాల్లో అమ్మమాట –అంగన్వాడీ బడిబాట కార్యక్రమంలో భాగంగా చిన్నారులకు మంగళవారం సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన సీడీపీవో రేవతి ముందుగా హరితహారంలో భాగంగా అంగన్వాడీ కేంద్రాల ఆవరణల్లో మొక్కలు నాటారు. సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కలిగి ఉండాలని సూచిస్తూ కిశోర బాలికలకు మిల్లెట్ చిక్కిల గురించి అవగాహన కల్పించారు.అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలకు ఎగబిర్యానీ భోజనం అందించారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో రేవతితో పాటు మోరంపల్లిబంజర్, ముసలిమడుగు సెక్టార్ సూపర్వైజర్లు స్వరాజ్యం, జగదాంబ, ఏఎన్ఎంలు రోశమ్మ, జయసు ధ, ఆశాలు రమేణ, లక్ష్మి, అంగన్వాడీ టీచర్లు భూలక్ష్మి, దేవకరుణ, వెంకమ్మ, పుల్లమ్మ, నాగరత్నం, హైమావతి, జ్యోతి, గంగమ్మ, రత్నకుమారి, ఆయాలు అక్కమ్మ, ఉష, కమలమ్మ, పోషణ్ అభియాన్ శంకర్, తల్లులు, చిన్నారులు పాల్గొన్నారు.

# వృద్ధ మహిళకు వసుధ ఫౌండేషన్ చేయూత



**చర్ల, జూన్ 17, ప్రజాజ్యోతి:** ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న చర్ల మండలం సత్యనారాయణపురం గ్రామానికి చెందిన మహిళ కాకర్లపూడి విజయలక్ష్మికి వసుధ ఫౌండేషన్ రూ పదివేల ఆర్థిక సహాయాన్ని అందజేసింది. ఆర్థిక సమస్యలను ఎదుర్కొంటున్న ఆమె వసుధ ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకట రామరాజు ను ఆశ్రయించింది. సానుకూలంగా స్పందించిన చైర్మన్ కాకర్లపూడి విజయలక్ష్మి కి రూ 10,000 ఆర్థిక సహాయం అందించాలని వసుధ ఫౌండేషన్ ఉమ్మడి ఖమ్మం జిల్లా కన్వీనర్ వేగేశ్న శ్రీనివాసరాజు కు సూచించారు. దీంతో మంగళవారం చర్ల లలో జరిగిన కార్యక్రమంలో భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానం విశ్రాంత కార్య నిర్వహణ అధికారి వేగేశ్న రామ కృష్ణంరాజు చేతుల మీదుగా కాకర్లపూడి విజయలక్ష్మికి రూ 10,000 చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో వసుధ ఫౌండేషన్ ఉమ్మడి ఖమ్మం జిల్లా కన్వీనర్ వేగేశ్న శ్రీనివాసరాజు పాల్గొన్నారు.